సాక్షి విశాఖపట్నం

ఆదివారం : 14 : జనవరి : 2024



భోగభాగ్యాల భోగి

తెలుగు లోగిళ్లలో సంక్రాంతి సంబరాలు మొదలయ్యాయి. పిండి వంటలు ఘుమఘుమలాడుతున్నాయి. డూడూ. బసవన్న ఆట పాటల సందడి నెలకుంది. ఆదివారం తెల్లవారు జామున భోగి మంట వేసి సంక్రాంతికి ఆహ్వానం పలికారు నగరవాసులు.

-ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖ

ఊరెళ్లాల్సిందే...!



సంక్రాంతి పండగ నేపథ్యంలో ప్రయాణికుల రద్దీ భారీగా పెరుగుతోంది. ఆర్టీసీ బస్సులు, రైళ్లు ఫుల్ రష్‌తో కిక్కిరిసిపోతున్నాయి. ద్వారకా బస్ కాంప్లెక్స్, మద్దిలపాలెం స్టేషన్‌లో జనాలు ఇసుక వేస్తే రాలనంతగా కిటకిటలాడుతున్నారు. పట్నవాసులంతా పల్లెలకు క్యూ కడుతుండడంతో బస్సులన్నీ రద్దీగా ప్రయాణిస్తున్నాయి. అలాగే విశాఖ రైల్వేస్టేషన్ కూడా కిక్కిరిసిపోయింది. జన్మభూమి, గోదావరి, రత్నాచల్, తిరుమల, విశాఖ ఇలా ప్రధాన రైళ్లన్నీ ఫుల్ రష్‌తో నడిచాయి.

- తాటిచెట్లపాలెం

ఫొటోలు : సాక్షి, ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ప్రయాణికుల రద్దీ



రైల్వే స్టేషన్ కిటకిట





ఆర్టీసీ బస్ స్టేషన్ వద్ద

ప్రతి ఇంటా సంతోషాలు పండాలి



మహారాణిపేట: తెలుగింట సంప్రదాయాలకు అద్దం పట్టే సంక్రాంతి ప్రతి ఇంటా సంతోషాలు నింపాలని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఆకాంక్షించారు. సంక్రాంతి శుభవేళ ప్రతి ఇళ్లా అష్టైశ్వర్యాలు, నూతన శోభను సంతరించుకోవాలన్నారు. ఈ సందర్భంగా నగర ప్రజలకు, అధికారులకు ఆయన పండగ శుభాకాంక్షలు తెలిపారు.

వెలుగులు నిండాలి





డాబాగార్డెన్స్: తెలుగు వారి పెద్ద పండగ సంక్రాంతిని పురస్కరించుకుని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ శుభాకాంక్షలు తెలియజేశారు. నగర ప్రజలు భోగి, సంక్రాంతి, కనుమ పండగలు సంప్రదాయబద్ధంగా, సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. భోగి రోజు రోడ్లపై భోగి మంటలు వేయరాదని, బహిరంగ ప్రదేశాలు, ఖాళీ స్థలాలు, మైదాన ప్రాంతాల్లో భోగి మంటలు వేసుకోవాలని సూచించారు. రోడ్లపై భోగి మంటలు వేయడం వల్ల తారు కరిగి రోడ్లు పాడవుతాయని, గుంతలు ఏర్పడతాయని పేర్కొన్నారు. భోగి మంటల్లో పాత టైర్లు, పర్యావరణానికి విఘాతం కల్గించే హానికరమైన వస్తువులు వినియోగించరాదని సంయుక్త ప్రకటనలో వారు విజ్ఞప్తి చేశారు.

సందడే..సందడి



పేడాడ రమణికుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, మాజీ ఎమ్మెల్యేలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, కార్పొరేటర్లు తదితరులు

ముంగిట ముత్యాల ముగ్గు .. చక్కగా తీర్చిదిద్దిన గొబ్బెమ్మలు.. భగభగ మండే భోగిమంటలు.. హరిదాసుల సంకీర్తనలు.. డూడూ బసవన్నల జోరు.. చెరకు గెడలు.. కమ్మని పాయసం.. ఇలా సంక్రాంతి పండగ ముందే వచ్చినట్లయింది. ఎండాడలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి.

కొమ్మాది: తెలుగు వారి పెద్ద పండగ సంక్రాంతి సంబరాలను వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఉత్సాహంగా నిర్వహించారు. డా.బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పాలక మండలి సభ్యురాలు పేడాడ రమణి కుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలు సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా సాగాయి.

ప్రతీ రోజూ సంక్రాంతే..: కోలా గురువులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలు ప్రతీ రోజు సంక్రాంతి పండగలా భావిస్తున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు అన్నారు. వివిధ సంక్షేమ పథకాల అమలుతో పేదల ఇంట పండగ వాతావరణం నెలకొంటుందన్నారు. సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్న ఆయన ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి భోగి మంటలతో సంబరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ చరిత్రలో ఏ రాష్ట్రం అమలు చేయని సంక్షేమ పథకాలు మన రాష్ట్రంలో అందుతున్నాయన్నారు. పేడాడ రమణి కుమారి మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బాధ్యతలు చేపట్టాక మహిళలకు అధిక ప్రాధాన్యం లభించిందన్నారు. అన్నింటిలో రిజర్వేషన్ కల్పిస్తూ ప్రోత్సహిస్తున్నారన్నారు. అదేవిధంగా ఉత్తరాంధ్ర జిల్లాలను అభివృద్ధి చేయడంతో పాటు ఉద్దానం కిడ్నీ వ్యాధిగ్రస్తుల సమస్యలను పరిష్కరించిన ఘనత సీఎం జగన్‌కు దక్కిందన్నారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో మళ్లీ వైఎస్సార్‌సీపీ విజయ ఢంకా మోగించడం తథ్యమన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు పసుపులేటి బాలరాజు, ఎస్.ఎ.రెహమాన్, చొక్కాకుల వెంకట్రావు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు కొండా రాజీవ్ గాంధీ, పేర్ల విజయచందర్, ఆనంద్‌సింగ్, పిల్లా సుజాత, నూకరాజు, అనూష పట్నాయక్, పిల్లి సుజాత, పార్టీ కార్యాలయ పర్యవేక్షకుడు రవిరెడ్డి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షురాలు పీలా ఉమారాణి, కార్పొరేటర్లు సునీత, సత్యనారాయణ, బిపిన్ కుమార్, పి.వి.సురేష్, వెంకటరమణ, పార్టీ ముఖ్యనేతలు, పలు విభాగాల ఇన్‌చార్జిలు జగ్గుపల్లి అప్పలరాజు, పల్లా చిన్నతల్లి, ఉమామహేశ్వరరావు, ఎం.లక్ష్మి, అల్లంపల్లి రాజబాబు, మారుతి ప్రసాద్, తుల్లి చంద్రశేఖర్, బోని శివరామకృష్ణ, నడింపల్లి కృష్ణంరాజు, రామన్నపాత్రుడు, కాళిదాస్ రెడ్డి, శ్రీదేవివర్మ, ఎం.రాజేశ్వరి, అప్పన్న, రాధ, బోండా ఉమామహేశ్వరరావు, కర్రి లక్ష్మి, ఎం.రాజేశ్వరి, షబ్బీర్ బేగం, ధనలక్ష్మి, ఉమ్మడి దాస్, సత్యాల సాగరిక పాల్గొన్నారు.



సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ మహిళా నేతలు

సంక్రాంతి వేళ 'మహాలక్ష్మి'!



విశాఖ బస్ కాంప్లెక్స్‌లో టికెట్ కౌంటర్ వద్ద ప్రయాణికుల రద్దీ

- మహాలక్ష్మి పథకంతో హైదరాబాద్‌లో తగ్గిన ఆర్టీసీ బస్సు సర్వీసులు
- అందుకనుగుణంగా అటు నుంచి బస్సులను పెంచిన మన ఆర్టీసీ
- గత సంక్రాంతికి ఉత్తరాంధ్ర నుంచి 450 సర్వీసులు
- ఈసారి ఆ సంఖ్య 650 వరకు పెంపు
- వీటిలో అధికంగా హైదరాబాద్ నుంచి నడుపుతున్న అధికారులు
- సమన్వయం కోసం ఆర్టీసీ ప్రత్యేక అధికారుల నియామకం

సాక్షి, విశాఖపట్నం: తెలంగాణలో మహాలక్ష్మి పథకం సంక్రాంతి వేళ ఏపీఎస్‌ఆర్టీసీకి కాసులు కురిపిస్తోంది. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించేందుకు వీలుగా తెలంగాణ ప్రభుత్వం ఇటీవల మహాలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టింది. దీంతో ఆ రాష్ట్రంలో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే మహిళల సంఖ్య గణనీయంగా పెరిగింది. దీంతో అక్కడ ప్రయాణికుల అవసరాలను తీర్చడానికి ఆర్టీసీ బస్సుల సంఖ్యను పెంచాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో మునుపటిలా ఈ సంక్రాంతి పండగకు ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ దూర ప్రాంతాలకు తగినన్ని స్పెషల్ బస్సులను నడిపే అవకాశం టీఎస్‌ఆర్టీసీకి లేకుండా పోయింది. దీనిని ఏపీఎస్‌ఆర్టీసీ అధికారులు అవకాశంగా మలుచుకున్నారు. హైదరాబాద్ నుంచి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు ఎక్కువ బస్సులను నడుపుతున్నారు. ఇలా ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి హైదరాబాద్, విజయవాడ, రాజమండ్రి తదితర దూర ప్రాంతాలకు మరిన్ని బస్సులను తిప్పుతున్నారు. గత సంక్రాంతికి ఉత్తరాంధ్ర నుంచి 450 స్పెషల్స్ తిప్పగా, ఈ సంక్రాంతికి ఆ సంఖ్య దాదాపు 650 వరకు ఉంటుందని అంచనా వేస్తున్నారు. వీటిలో హైదరాబాద్ సర్వీసులే 150 వరకు ఉంటాయని చెబుతున్నారు. ఏటా సంక్రాంతి పండుగకు తెలంగాణలోని హైదరాబాద్ సహా ఇతర ప్రాంతాల నుంచి ఉత్తరాంధ్ర జిల్లాలకు పెద్ద సంఖ్యలో జనం వస్తుంటారు. వీరిని దృష్టిలో ఉంచుకుని ఈనెల 10వ తేదీ నుంచి 14 వరకు, తిరిగి 17 నుంచి 22 వరకు ప్రత్యేక బస్సులను నడుపుతున్నారు. 10 నుంచి 14 వరకు హైదరాబాద్, విజయవాడ, రాజమండ్రి తదితర ప్రాంతాల నుంచి ఉత్తరాంధ్ర జిల్లాలకు స్పెషల్స్‌ను అందుబాటులో ఉంచుతున్నారు. సంక్రాంతి తర్వాత 17 నుంచి 22 వరకు ఉత్తరాంధ్ర నుంచి హైదరాబాద్, విజయవాడ, రాజమండ్రి వైపు నడిపేందుకు నిర్ణయించారు.

80 శాతం ఓఆర్

హైదరాబాద్ నుంచి ఉమ్మడి విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు వచ్చే వారి కోసం ఏర్పాటు చేసిన బస్సుల్లో ప్రయాణికుల రద్దీ అధికంగానే ఉంటోంది. దీంతో ఈ బస్సులు జనంతో కిటకిటలాడుతూ కనిపిస్తున్నాయి. వీటిలో 80 శాతానికి పైగా ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్) ఉంటోంది. ఇది ఏపీఎస్‌ఆర్టీసీకి అదనపు ఆదాయాన్ని తెచ్చిపెడుతోంది. గత ఏడాదికంటే ఈ సంక్రాంతికి డిమాండ్ ఎంతో మెరుగ్గా ఉందని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. తెలంగాణ రాష్ట్రంలో మహాలక్ష్మి పథకం అమలుతో అక్కడ బస్సులు స్థానికుల అవసరాలకే సరిపోతున్నాయని, మునుపటిలా ఆంధ్రప్రదేశ్ సహా ఇతర రాష్ట్రాలకు సంక్రాంతికి అదనంగా బస్సులు నడిపే పరిస్థితి లేదని ఓ ఆర్టీసీ అధికారి ‘సాక్షి’కి చెప్పారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఏపీఎస్‌ఆర్టీసీ యాజమాన్యం హైదరాబాద్ నుంచి గతం కంటే ఎక్కువ సర్వీసులను నడుపుతూ ప్రయాణికుల అవసరాలు తీరుస్తోందని వివరించారు. ఇప్పటికే పలువురు బస్సుల్లో ముందస్తు రిజర్వేషన్లు చేయించుకున్నారు.

సమన్వయానికి అధికారులు..

మరోవైపు హైదరాబాద్‌లో ఉత్తరాంధ్ర సహా ఆంధ్ర ప్రాంతానికి నడిపే ఏపీఎస్‌ఆర్టీసీ బస్సులను సమన్వయం చేయడానికి, ప్రయాణికులకు సహకరించడానికి యాజమాన్యం ప్రత్యేక అధికారులను నియమించింది. వివిధ స్థాయిల అధికారులు హైదరాబాద్‌లోని ప్రధాన జంక్షన్లలో ఉంటూ స్పెషల్ సర్వీసులను పర్యవేక్షిస్తున్నారు.

జాతీయ ఫుట్‌బాల్ పోటీలకు భీమిలి విద్యార్థి



కోలా భాగ్యేష్

తగరపువలస: ఈ నెల 17 నుంచి 21 వరకు రాంచీలో జరగనున్న జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్‌లో అండర్-14 విభాగం ఫుట్‌బాల్ పోటీలకు భీమిలికి చెందిన కోలా భాగ్యేష్ పాల్గొంటున్నాడు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి అక్కరమాని చినబాబు, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి నాగేశ్వరరావు, కోచ్ రాజేంద్ర, ప్రిన్సిపాల్ ఇ.ఎం. సిబి అభినందించారు.

జూ పార్కు సోమవారం తెరిచే ఉంటుంది

ఆరిలోవ : జూ పార్కు సంక్రాంతి సందర్భంగా సోమవారం తెరవనున్నట్లు జూ క్యూరేటర్ నందనీ సలారియా శనివారం తెలిపారు. వన్యప్రాణుల ఎన్‌క్లోజర్లు శుభ్రం చేసే చర్యల్లో భాగంగా ప్రతి సోమవారం సెలవు. సంక్రాంతి సందర్భంగా సందర్శకుల సౌకర్యార్థం సోమవారం జూ పార్కును తెరవనున్నట్లు ఆమె ప్రకటించారు.

టూరిజం హబ్‌గా విశాఖ



ఈట్ స్ట్రీట్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

కొమ్మాది : విశాఖ నగరం టూరిజం హబ్‌గా మారుతోందని ఇప్పటికే తీర ప్రాంతాల్లో అనేక పార్కులను ఏర్పాటు చేశారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్ వద్ద మూడు కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఈట్ స్ట్రీట్ పనులను ఆయన ప్రారంభించారు. మొత్తం 18 షాపులు ఇక్కడ ఏర్పాటు చేయనున్నారని, అదే విధంగా ఫుడ్ కోర్టు, ఔట్‌డోర్ సీటింగ్, కిడ్స్ ప్లేగ్రౌండ్, ల్యాండ్ స్కాపింగ్, యాంఫీథియేటర్, హార్డ్ స్కాపింగ్ ఇక్కడ ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. గత ప్రభుత్వం కన్నా నేటి ప్రభుత్వ హయాంలో పర్యాటక ప్రాంతాలు అభివృద్ధి చెందాయని, పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. ఇప్పటికే సాగర్‌నగర్, రుషికొండ, మంగమారిపేట, తొట్లకొండ, భీమిలి కొబ్బరి చెట్ల పార్కు అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ఆర్‌కే బీచ్ నుంచి భీమిలి బీచ్ వరకు పార్కుల అభివృద్ధితో పాటు సుందరీకరణ జరిగిందన్నారు. రూ.6 కోట్లతో మంగమారిపేట బీచ్ రోడ్డు నుంచి భీమిలి వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రానున్న కాలంలో పర్యాటకులను మరింత ఆకర్షించే విధంగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో యువజన విభాగం రీజనల్ కోఆర్డినేటర్ ముత్తంశెట్టి నందీష్, కార్పొరేటర్ లొడగల అప్పారావు, క్లస్టర్ ఇన్‌చార్జిలు గుడ్లపోలి రెడ్డి, ఉప్పులూరి గోపి, లొడగల రామ్మోహన్, నొడగల రాంబాబు, అల్లాడ ఉమామహేశ్వరరావు, మాదు చంటి, రమణమూర్తి, వర్మ రాజు, పవన్, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

ఎంసీఎల్ పోటీలు ప్రారంభం



బ్యాటింగ్ చేస్తున్న సీపీ

విశాఖ స్పోర్ట్స్: సంక్రాంతి పర్వదినం పురస్కరించుకుని కమ్యూనిటీ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం చక్కటి పరిణామమని నగర పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్ అన్నారు. రైల్వేస్టేడియంలో శనివారం ఆయన మర్వాడీ క్రికెట్ లీగ్(ఎంసీఎల్) పోటీలను ప్రారంభించి మాట్లాడారు. ఈ టోర్నీలో జట్లు చక్కటి క్రీడాస్ఫూర్తితో ఆడాలని సూచించారు. వచ్చే నెల 2వ తేదీ నుంచి విశాఖలో ఇంగ్లాండ్‌తో భారత్ జట్టు టెస్ట్ మ్యాచ్ ఆడనుందని గుర్తు చేశారు. 10 జట్లు ఈ టోర్నీలో పాల్గొంటుండగా 18న టైటిల్ పోరు జరగనుంది. కాసేపు సీపీ బ్యాటింగ్ చేసి ఆటగాళ్లలో ఉత్సాహాన్ని నింపారు. జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో రాఘం కిశోర్, రాజేష్ పగారియా తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీని సందర్శించిన ట్రైనీ ఐఏఎస్‌లు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ చేపడుతున్న పలు ప్రాజెక్ట్‌లను శనివారం ట్రైనీ ఐఏఎస్‌లు సందర్శించారు. నగరానికి విచ్చేసిన 19 మంది 2022 బ్యాచ్ ట్రైనీ ఐఏఎస్‌లకు జీవీఎంసీ చేపడుతున్న పలు ప్రాజెక్టులను జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, ప్రాజెక్ట్ ఆఫీసర్ బంటు సన్యాసినాయుడు, పర్యవేక్షక ఇంజినీర్లు వినయ్‌కుమార్, కేవీఎస్ రవి, కృష్ణారావు చూపించారు. ప్రాజెక్ట్, ఫ్లోటింగ్ సోలార్ వ్యవస్థ, స్పోర్ట్స్ ఎరీనాల గురించి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వారికి వివరించారు.



ప్రాజెక్టులు పరిశీలిస్తున్న ట్రైనీ ఐఏఎస్‌లు

జీవీఎంసీలో ఏ పోస్టులు భర్తీ చేయడం లేదు

మేయర్ గొలగాని హరి వెంకటకుమారి

డాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రజారోగ్య విభాగంలో ఎటువంటి సూపర్‌వైజర్ పోస్టులు భర్తీ చేయడం లేదని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి ఓ ప్రకటనలో తెలిపారు. శానిటరీ సూపర్‌వైజర్ల ఉద్యోగాలు భర్తీ చేస్తున్నారని కొంత మంది దళారులు వసూళ్లకు పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. దళారులను నమ్మి నిరుద్యోగులు మోసపోవద్దని సూచించారు. జీవీఎంసీలో శానిటరీ సూపర్‌వైజర్ల నియామకాల కోసం ప్రభుత్వం ఎటువంటి జాబ్ నోటిఫికేషన్ జారీ చేయలేదని స్పష్టం చేశారు.

భారీ తగ్గింపు ధరకు బ్రాండెడ్ దుస్తులు



దుస్తులు కొనుగోలు చేస్తున్న నగర ప్రజలు

బీచ్‌రోడ్డు: సంక్రాంతి పండగ పురస్కరించుకుని భారీ తగ్గింపు ధరతో విక్రయిస్తున్న బ్రాండెడ్ దుస్తుల కొనుగోలుకు నగరవాసులు ఆసక్తి చూపిస్తున్నారు. బీచ్‌రోడ్డులోని పార్క్ హోటల్, పామ్ బీచ్ హోటల్‌లో ఏర్పాటు చేసిన ఈ ఎగ్జిబిషన్‌లో పేరొందిన బ్రాండెడ్ దుస్తులు, షూలు 80 శాతం వరకు భారీ తగ్గింపు ధరతో అందుబాటులోకి తీసుకొచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు. రూ.6 వేల విలువ గల వస్త్రాలను కేవలం రూ.550, రూ.800, రూ.1100లకే విక్రయిస్తున్నట్లు చెప్పారు. పిల్లల నుంచి పెద్దల వరకు అన్ని వయసుల వారికి వందలాది రకాల మోడళ్లు అందుబాటులో ఉన్నాయన్నారు. సోమవారం రాత్రి 10గంటల వరకు ఈ ప్రదర్శన కొనసాగుతుందని వివరించారు.

రియల్ హీరో సీఎం జగన్

- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు
- అడవివరంలో ఘనంగా సంక్రాంతి సంబరాలు



మహిళలకు చీరలు అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

సింహాచలం: పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. అడవివరంలోని ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో శనివారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు హయాంలో అంతా అవినీతిమయంగానే పాలన సాగిందన్నారు. జన్మభూమి కమిటీలు సూచించిన వారికే పథకాలు అందిన పరిస్థితి చూశామన్నారు. కానీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. కరోనా సమయంలో కూడా ప్రజా సంక్షేమం అందించిన ఘనత ఆయనికే దక్కుతుందన్నారు. ఆ సమయంలో వలంటీర్లు అందించిన సేవలు మరువలేనివన్నారు. టీడీపీ ప్రభుత్వంలో మున్సిపల్ కార్మికులకు రూ.6 వేలు ఇస్తే.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన వెంటనే రూ.18 వేలకు పెంచారని గుర్తు చేశారు. ఆర్పీలకు టీడీపీ ప్రభుత్వంలో రూ.3 వేలు ఇచ్చే వారని.. దాన్ని రూ.10వేలు చేసిన ఘనత ఆయనిదేనన్నారు. టీడీపీ, వైఎస్సార్ సీపీ పాలనలో తేడా.. జరిగిన అభివృద్ధిని ప్రతి ఒక్కరూ గ్రహించాలని సూచించారు. 98వ వార్డులోనే రూ.125 కోట్లతో సంక్షేమ పథకాలు అందించామన్నారు. అలాగే 2,300 మందికి ఇళ్ల పట్టాలు అందజేసినట్లు చెప్పారు. ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రియల్ హీరో అని కొనియాడారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే గెలిపించాలని కోరారు. వైఎస్సార్ సీపీ భీమిలి ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్, 98వ వార్డు అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు, ఇన్‌చార్జి ఎర్ర వరహా నరసింహం, అడవివరం కో–ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి, నాయకులు పీతల అప్పలరాజు, లంక సత్తిబాబు, లోగిశ మాధవరావు, కర్రి సత్తిబాబు, బోర కృష్ణారెడ్డి, దాసరి కనకరాజు, గేదెల మురళీకృష్ణ, మజ్జి ధర్మా, వర్మ తదితరులు పాల్గొన్నారు.

'గుర్తింపు పొందిన ఏజెన్సీల ద్వారా వాహన పన్ను చెల్లింపు'

అల్లిపురం: జీవీఎంసీ మెకానికల్ విభాగంలో ఏటా వాహనాలకు రోడ్ పన్ను చెల్లించడం యథావిధిగా జరుగుతున్న ప్రక్రియ అని జీవీఎంసీ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. 'సాక్షి' దినపత్రికలో శనివారం ప్రచురితమైన 'లోగుట్టు పెరుమాళ్లకెరుక' వార్తకు అధికారులు వివరణ ఇచ్చారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన సీఎస్‌సీ ద్వారా కొన్నేళ్లుగా జీవీఎంసీ మెకానికల్ విభాగం వాహన నిర్వహణ రికార్డులు నిర్వహిస్తోందని పేర్కొన్నారు. మార్చి చివరి వారంలోనే ముగ్గురు సీఎస్‌సీ ఆథరైజ్డ్ ఏజెంట్లను పిలిపించి తక్కువ కమిషన్‌కు కొటేషన్ అందించిన తులసీదాస్, పిసాన్ ఇంజినీరింగ్ ఏజెన్సీలు అందించిన పత్రాలను పరిశీలించామన్నారు. అంగీకారపత్రం తీసుకుని వారి ద్వారా సుమారు రూ.60లక్షల పాత బకాయిలతో కలిపి రోడ్ ట్యాక్స్‌ను చెల్లించినట్లు తెలిపారు. జీవీఎంసీ మెకానికల్ విభాగానికి సంబంధిత ఏజెన్సీల ద్వారా ఆర్టీఏ రసీదులు, డాక్యుమెంట్లు అందించామన్నారు.

సింహగిరిపై సంక్రాంతి సంబరాలు నేడు

పల్లె వాతావరణాన్ని తలపించేలా ఏర్పాట్లు



రాజగోపురం ఎదురుగా భోగి మంటకు ఏర్పాట్లు

సింహాచలం: సింహగిరిపై ఆదివారం ఉదయం సంక్రాంతి సంబరాలను కనులపండువగా నిర్వహించేందుకు శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం అధికారులు ఘనంగా ఏర్పాట్లు చేశారు. హిందూ సనాతన ధర్మాన్ని, తెలుగు సంస్కృతిని, గ్రామీణ జీవన విధానాన్ని ప్రతిబింబించే విధంగా ఈ వేడుకలు నిర్వహించనున్నారు.

రాజగోపురం ఎదురుగా మాడవీధిలో భోగి మంటలు

రాజగోపురం ఎదురుగా ఉన్న మాడ వీధిలో ఉదయం పెద్ద ఎత్తున భోగి మంటను వేసేందుకు ఏర్పాట్లు చేశారు. గొబ్బెమ్మలతో ముత్యాల ముగ్గులు, డూడూ బసవన్నల విన్యాసాలు, జంగమ దేవర, కొమ్మదాసరి, హరిదాసు వేషధారణలు, కపిలగోవు, కపిలగిత్త, ఎడ్లబండి ప్రదర్శనలు కనువిందు చేయనున్నాయి. గోపూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఉదయం 9 గంటలకు చిన్నారులకు భోగిపళ్లు పోసే కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. రాజగోపురం మార్గాన్ని విశేషంగా అలంకరించారు.

16న అప్పన్న మకరవేట ఉత్సవం

సింహాచలం: కనుమ పురస్కరించుకుని ఈ నెల 16వ తేదీ మంగళవారం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి మకరవేట (గజేంద్రమోక్షం) ఉత్సవం జరగనుంది. కొండదిగువ పూలతోటలో ఈ ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఆపదలో ఉన్నవారెవరు పిలిచినా భగవంతుడు ఏదో ఒకరూపంలో వచ్చి రక్షిస్తాడని.. మొసలి బారిన పడిన గజేంద్రుడి చరిత్రే దానికి నిదర్శనమని చాటిచెబుతూ ఈ ఉత్సవాన్ని ఏటా కనుమ పండగ రోజు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

ఉత్సవం జరిగేదిలా..

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామికి వరదరాజస్వామి అలంకరణ చేసి మంగళవారం సాయంత్రం 4గంటలకు సింహగిరి నుంచి కొండదిగువకు మెట్లమార్గం ద్వారా తీసుకొస్తారు. కొండదిగువ ఉన్న పూలతోటలోని ప్రధాన మండపంలో స్వామిని కొలువుదీర్చి, గజేంద్రమోక్షం ఉత్సవాన్ని నిర్వహిస్తారు. అనంతరం స్వామిని పుష్కరిణి సత్రం వద్దకు తీసుకొచ్చి గజవాహనంపై అధిష్ఠింపజేస్తారు. తదుపరి అడవివరం గ్రామ వీధుల్లో గజవాహనంపై స్వామికి తిరువీధి నిర్వహిస్తారు. ఉత్సవాన్ని పురస్కరించుకుని పూలతోటను విశేషంగా ముస్తాబు చేశారు. పూలతోటలోని శ్రీకృష్ణకొలను, స్వామి వేంజేసే ప్రధాన మండపం, రాతి ఫౌంటెన్లకు విద్యుద్దీపాలంకరణ చేస్తున్నారు.

సాయంత్రం 6గంటల వరకే దర్శనాలు

మకరవేట ఉత్సవాన్ని పురస్కరించుకుని సింహగిరిపై శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి మూలవిరాట్ దర్శనాలు మంగళవారం సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే లభిస్తాయని ఈవో తెలిపారు. భక్తులు ఈ విషయం గమనించాలని సూచించారు.

కోడి పందాలు నిర్వహిస్తే జైలే..

- పేకాట, బల్లాటలు, గ్యాంబ్లింగ్ నిర్వాహకులపై నిఘా
- జూద క్రీడలు నిర్వహించినా, పాల్గొన్నా చర్యలు తప్పవు
- నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్

విశాఖ సిటీ: సంక్రాంతి సందర్భంగా కోడిపందాలు, ఇతర జూద క్రీడల నిర్వాహకులపై పోలీసులు నిఘా పెట్టారు. నగర పరిధిలో పందాలు, పేకాట, బల్లాటలు, గ్యాంబ్లింగ్ స్థావరాలపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రధానంగా నగర శివారు పోలీస్ స్టేషన్ల పరిధిలో ఇటువంటి వాటికి అవకాశం లేకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నారు. సులభంగా డబ్బు సంపాదించవచ్చన్న దురాశతో కొంత మంది పందాలు, జూదం ఆడుతూ డబ్బు నష్టపోతున్నారు. దీని కారణంగా కొన్ని సందర్భాల్లో కుటుంబాలు విచ్ఛిన్నమయ్యే ప్రమాదం ఉండడంతో పాటు కొన్ని సందర్భాల్లో శాంతి భద్రతల సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉంది. దీంతో ఈ జూద క్రీడలు నిర్వహించే వారిపైనే కాకుండా పాల్గొన్న వారిపై కూడా చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ హెచ్చరించారు. సంస్కృతి, సంప్రదాయాల నడుమ సంక్రాంతి వేడుకలు చేసుకోవాలని అందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ పలు సూచనలు చేశారు.

- అసాంఘిక జూద క్రీడల జోలికి పోకుండా, సుఖ సంతోషాలతో పండగ చేసుకోవాలి. చట్ట వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొని కేసుల్లో చిక్కుకోవద్దు.
- నగర పరిధిలో కోడిపందాలు, పేకాట, బల్లాటలు ఇతర గాంబ్లింగ్‌లు ఎవరైనా నిర్వహించినా, పాల్గొన్నా, అలాగే అటువంటి కార్యకలాపాలకు స్థలాలు, భూములు ఇచ్చినా, అశ్లీల నృత్యాలు ప్రదర్శించినా వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం.
- గతంలో కోడిపందాలు, పేకాట, బల్లాటలు నిర్వహించిన ప్రదేశాలపై, నిర్వాహకులపై ప్రత్యేక దృష్టి పెట్టారు.
- నగరంలో ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే సంబంధిత పోలీసు స్టేషన్‌కు లేదా సీపీ వాట్సాప్ నంబర్ 94933 36633, పోలీసు హెల్ప్‌లైన్ 112కు సమాచారం అందించాలని సీపీ సూచించారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

19 నుంచి విశాఖ- రాయ్‌పూర్ పాసింజర్ రద్దు

మరికొన్ని రద్దు, గమ్యం కుదింపు, రీ షెడ్యూల్

తాటిచెట్లపాలెం: ఈస్ట్‌కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ సింగపూర్‌రోడ్–రాయగడ స్టేషన్ల మధ్య జరుగుతున్న 3వ లైన్ పనుల కారణంగా ఈ మార్గంలో ప్రయాణించే పలు రైళ్లను ఆయా తేదీల్లో రద్దు చేసినట్లు వాల్తేర్ సీనియర్ డివిజినల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె.త్రిపాఠి తెలిపారు. మరికొన్నింటిని గమ్యం కుదించడంతో పాటు రీషెడ్యూల్ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రద్దు చేసిన రైళ్లు ఇవే..

ఈ నెల 19 నుంచి 27వ తేదీ వరకు విశాఖపట్నం–రాయ్‌పూర్ (08528) పాసింజర్ స్పెషల్, విశాఖపట్నం–భవానీపట్న(08504) పాసింజర్ స్పెషల్, విశాఖపట్నం–కోరాపుట్(08546) పాసింజర్ స్పెషల్, ఈ నెల 20 నుంచి 28వ తేదీ వరకు రాయ్‌పూర్–విశాఖపట్నం(08527) పాసింజర్ స్పెషల్, విశాఖపట్నం–భవానీపట్న (08503) పాసింజర్ స్పెషల్, కోరాపుట్ –విశాఖపట్నం(08545) పాసింజర్ స్పెషల్స్‌ను రద్దు చేశారు.

- ఈ నెల 19, 22, 26వ తేదీల్లో విశాఖపట్నం–కోరాపుట్(18512)బై వీక్లీ ఎక్స్‌ప్రెస్, 20, 23, 27వ తేదీల్లో కోరాపుట్–విశాఖపట్నం (18511)బై వీక్లీ ఎక్స్‌ప్రెస్, ఈ నెల 18, 21, 25వ తేదీల్లో తిరుపతి–బిలాస్‌పూర్(17482) బై వీక్లీ ఎక్స్‌ప్రెస్, 20, 23, 27వ తేదీల్లో బిలాస్‌పూర్–తిరుపతి (17481) బై వీక్లీ ఎక్స్‌ప్రెస్‌లు రద్దయ్యాయి.

విజయనగరం వరకే గుంటూరు–రాయగడ ఎక్స్‌ప్రెస్

ఈ నెల 19 నుంచి 27వ తేదీ వరకు గుంటూరు–రాయగడ(17243) ఎక్స్‌ప్రెస్ విజయనగరం వరకు మాత్రమే నడుస్తుంది. ఈ నెల 20 నుంచి 27వ తేదీ వరకు రాయగడ–గుంటూరు(17244) ఎక్స్‌ప్రెస్ విజయనగరం నుంచి బయలుదేరుతుంది.

దారి మళ్లించిన రైళ్లు ఇవే..

- హౌరా–జగదల్‌పూర్–హౌరా(18005/18006) సమలేశ్వరి ఎక్స్‌ప్రెస్ ఈ నెల 19 నుంచి 26వ తేదీ వరకు వయా తెరుబలి–కేట్టుగుడ మీదుగా నడుస్తుంది.
- ఈ నెల 19, 20, 23, 25, 26వ తేదీల్లో పూరి–అహ్మదాబాద్(12843) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, 20, 21, 22, 25వ తేదీల్లో అహ్మదాబాద్–పూరి(12844) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, 20, 27వ తేదీల్లో పూరి–గాంధీదాం(22974) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, 24న గాంధీదాం–పూరి (22973) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లు టిట్లాఘడ్, కేరేజంగ, ఖుర్దారోడ్ మీదుగా నడుస్తాయి.
- ఈ నెల 21, 25వ తేదీల్లో టాటా–ఎర్నాకులం (18189) ఎక్స్‌ప్రెస్, 21, 24వ తేదీల్లో ఎర్నాకులం–టాటా(18190) ఎక్స్‌ప్రెస్‌లు వయా జరోలి–పలాస–విజయనగరం మీదుగా నడుస్తాయి.
- ఈ నెల 20న కోయంబత్తూర్–బరౌని(03357) స్పెషల్ ఎక్స్‌ప్రెస్, 24న బరౌని–కోయంబత్తూర్(03358) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ వయా విజయనగరం, ఖుర్దారోడ్, తాల్చేర్ మీదుగా నడుస్తాయి.

రీ షెడ్యూల్ చేసిన రైళ్లు

- ఈ నెల 21న ఉదయం 8.20 గంటలకు బయలుదేరాల్సిన విశాఖపట్నం–లోకమాన్య తిలక్ టెర్మినస్ (22847) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఐదు గంటలు ఆలస్యంగా మధ్యాహ్నం 1.20 గంటలకు బయలుదేరుతుంది.
- ఈ నెల 23న మధ్యరాత్రి 12.15గంటలకు బయలుదేరాల్సిన లోకమాన్యతిలక్ టెర్మినస్–విశాఖపట్నం(22848) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రెండు గంటలు ఆలస్యంగా 24వ తేదీ తెల్లవారుజాము 2.15 గంటలకు బయలుదేరుతుంది.
- ఈ నెల 20, 22, 23, 27వ తేదీల్లో సాయంత్రం 4.30 గంటలకు బయలుదేరాల్సిన నాందేడ్–సంబల్‌పూర్(20810) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ నాలుగు గంటలు ఆలస్యంగా రాత్రి 8.30 గంటలకు బయలుదేరుతుంది.
- ఈ నెల 25న తెల్లవారు 5.20గంటలకు బయలుదేరాల్సిన విశాఖపట్నం–భగత్‌కి కోటి (18573) ఎక్స్‌ప్రెస్ 8 గంటలు ఆలస్యంగా మధ్యాహ్నం 1.20 గంటలకు బయలుదేరుతుంది.